# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

జూన్ 2023

వెల : రూ.10.00



ఏప్రియల్ 5 నుండి 9 వరకు శుక బ్రహ్మాశ్రమము, శ్రీకాళహస్తి వారు
నిర్వహించిన శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి 25వ పుణ్యారాధన
కార్యక్రమములో పాల్గొన్న శ్రీ మాతాజీవారు









# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293206.
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**
మిస్. పి. ఇందిరాదేవి
డా॥ యమ్. స్వర్ణముఖి
సి.వి. రమణ బాబు
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ

సంపుటి 42 సంచిక 10
పేజీలు 44
జూన్ 2023

5సం॥ల చందా రూ. 500
2సం॥ల చందా రూ. 240
సంవత్సర చందా రూ. 120
విడిప్రతి వెల...... రూ. 10

**బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా**
**మేనేజరు**
**సమర్థ సద్గురు మాగజైన్**
**శ్రీకాళీగార్డెన్స్ – 522508, నంబూరు**
**గుంటూరు జిల్లా**

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో ............................. ....... పేజీ**

దాశరథీ శతకము ............................ ..........4
శ్రీబాబూజీ ఉవాచ........................................ 5
అమ్మమాట.................................... ............ 7
మనశ్శతకము ...................................................9
విశ్వాసమే రక్ష......... .... ............................... 10
నేను కనుక లేకపోతే ...... ...........................12
అగస్త్య హృదయం ....................... ..............14
మమకారం ................ ..................................... 16
ధ్యాన ధ్యాతృ ధ్యేయరూపా .........................18
బ్రహ్మచర్యం ................ ................. .................. 21
బాల గంగాధరనాథ స్వామి.. ...............25
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు .....................27
మధుర భక్తి ..... .... ................ ............. ....28
నిరీక్షణ .......................................................................31
సుబోధ ..............................................................34
గురు రక్షణకు దూరం అడ్డు రాదు .......35
గురువు వెంట వుంటే ........ ......................37
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39
విష్ణు కథలు ....... ............................ ...................41

## **దాశరథీ శతకము** - భద్రాచల రామదాసు

**35) అవనిజ కన్నుదోయి తొగలందు వెలింగెడు సోమ, జానకీ**
**కువలయనేత్రి గబ్బిచనుకొండల నుండు ఘనంబ మైథిలీ**
**నవనవ యౌవనంబను వనంబునకున్ మదదంతి నీవెకా**
**దవిలి భజింతు నెల్లపుడు దాశరథీ! కరుణాపయోనిధీ!**



భావం - సీత కన్నులను కలువలకు చంద్రుడవు, సీత యొక్క ఉబ్బిన స్తనములను కొండల నుండెడి మేఘమవు, సీత యొక్క క్రొంగ్రొత్త యౌవనమను వనమునకు మదించిన ఏనుగువంటివాడవు నీవని ఇష్టముతో గొలుతును దాశరథీ! కరుణాపయోనిధీ!

**కైకేయి రాముని వనవాసానికి పంపడానికి అసలు కారణం ఏమిటి?*
**కోదండరామయ్యకు ఎందుకు షాక్ కొట్టింది?*
**మనం ఇతరులతో ఎలా ప్రవర్తించాలన్న ప్రశ్నకు రమణమహర్షి సమాధానం ఏమిటి?*
**ఆరు అక్షరాలున్న* ***ఓంనమశ్శివాయ*** *పంచాక్షరి ఎలా అయ్యింది?*
**కోతి దుఃఖానికి కారణం ఏమిటి?*
**అరుంధతీదేవి సందేహాన్ని వశిష్టులవారు ఎలా తీర్చారు?*
**రాముడు లంకను కాల్చే పని ఎవరికి అప్పగించాడు?*
**పండితునికి దక్కని మోక్షం గొల్లెలకాపరికి ఎలా దక్కింది?*
**గురు పాదాల చెంతనే సమస్త క్షేత్రాలు ఉంటాయని నిరూపించిన భక్తుడెవరు?*
**ఉత్తమజన్మ కోరుకోవడం మంచిదేనా?*

***సమాధానాలు లోపలి పేజీలలో .............................***

# శ్రీ బాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

31-7-1981

ఈరోజు రాత్రి ప్రార్థన అయిన తర్వాత శ్రీ బాబూజీ దర్శనం యిచ్చారు.

శ్రీ బాబూజీ మాట్లాడుతూ, "మానవుల స్వభావం విచిత్రంగా వుంటుంది. మేము భగవంతుడిని నమ్ముకున్నాము. మాకు భగవంతుడు ఏం చేశాడు? అనుకుంటారు కొందరు. మరికొందరు, నా భార్య ప్రసవించటం ఆలస్యం అయిందనో, నాకు వార్ధక్యం రాకుండానే జుట్టు తెల్లబడిందనో, లేక వాడి జుట్టు నల్లగానే ఉందనో అంటారు దాని బాధ్యత భగవంతునిదా? పోనీ గురు దేవునిదా?



నా కూతురికి సీటు రాలేదనో, నా కూతురికి పెండ్లి సంబంధం కుదరలేదనో లేక నాకు ట్రాన్స్ఫరు అయిందనో అనుకొని దీనికంతకూ గురుదేవుడే కారణము అని నిందించినట్లు ఉంటుంది.

ఇవన్నీ పరిణామముతో కూడుకున్నవి. పరిణామము చెందే వాటిని ప్రేమించి భగవంతుడిని నిందిస్తే ఏం లాభం? నీ ప్రారబ్ధకర్మ నువ్వు అనుభవించవలసిందే. మానవుడు ప్రేమించాల్సింది నిత్యమైన శాశ్వతమైన ఆత్మతేజస్సు గాని, పరిణామముతో కూడిన ఇంద్రియ సుఖాలు కాదు. భోగభాగ్యలు, సంపదలు అని బాధపడితే ప్రయోజనం ఏముంది?

మనస్సు భగవానునియందు నిలుపని వాడు నన్ను భగవానుడు రక్షించలేదంటే ఎలా రక్షిస్తాడు? భక్తి సరియైనదైతే తప్పక పరమాత్ముని అనుగ్రహం లభిస్తుంది. ఈ ఒక్కటి అర్థం చేసుకుంటే చాలు. కొంతమంది మానవులు ఇంకా విచిత్రంగా ఉంటారు. వారిని అర్థం చేసుకోవటం చాల కష్టము. ఏదో పూర్వజన్మ సుకృతంకొద్దీ మానవ

జన్మ లభించిందనుకోండి. ఈ జన్మని సార్థకం చేసుకొని ఇంక జన్మ రాకుండా చేసుకోవాలిగాని, అలా కాకుండా కొంతమంది 'భగవంతుడా నాకు ఉత్తమ జన్మని ప్రసాదించు' అని కోరుకుంటారు. ఉత్తమజన్మ కోరుకోవటం అంటే సంకల్పము అన్నమాట. ఏ ఒక్క సంకల్పము మిగిలినా జన్మ తప్పదు. మరుజన్మలో వాడు మానవజన్మ పొందుతాడని గ్యారంటీగా చెప్పగలరా? కాబట్టి ఈ జన్మని సార్థకం చేసుకొని ఇక జన్మ రాకుండా చేసుకోవాలి. అన్ని జన్మలలోకి ఉత్తమమైనది మానవజన్మ.

అటువంటి మానవజన్మ లభించి భక్తి కలగటం ఇంకా శ్రేష్ఠము. భక్తి కలిగి సత్పురుషులను ఆశ్రయించటం చాలా దుర్లభం. తన్ను తాను తెలుసుకొన్న ఆత్మజ్ఞాన సంపన్నులైన మహాత్ములు ఏ ఒక్కరో ఉంటారు. 'అట్టి మహాత్ములకూ నాకూ తేడా లేదు' అని పరమాత్ముడు స్వయంగా చెప్పాడు. అట్టి మహాత్ముల అభయహస్త కిరణాలలో జీవించేవాడికి లోటు ఏముంది? అయితే విశ్వాసము ఉండాలి" అన్నారు శ్రీ బాబు.



(గత సంచిక తరువాయి) **అమ్మ మాట** - జపమాలా ప్రసాద

## ప్రణవ స్వరూపుడు గురుదేవుడు

అయితే 'నమశ్శివాయ' అనే పంచాక్షరీ మహా మంత్రానికి ముందు ఓం వుంటే ఆరు అక్షరాలు అవుతాయి కదా అయినా కూడా 'పంచాక్షరీ మంత్రం' అని దానిని ఎందుకు అంటారని మీరడగవచ్చు. మనకి శివ పంచాక్షరీ ఉపనిషత్తులో ఏమని చెప్పబడి వున్నది? **ఓం ప్రణవః తస్మాన్నకార, మకార, శికార, వకార, యకార రూప పంచాక్షరా జాయంతే** అంటే ఓం అనేది ప్రణవం. దాని నుండి నకారం, మకారం, శికారం, వకారం, యకారం ఉద్భవించాయి, లేక పుట్టాయి అని. కనుక పంచాక్షరీ మంత్రంలో ఓంకారం అంతర్లీనంగా వుండి, పంచాక్షరికి సాక్షిగా వుంటుంది.

నారాయణోపనిషత్తు కూడా ఓంకారం గురించి చెబుతూ '**ఓం ప్రత్యగానందం బ్రహ్మ పురుషం, ప్రణవ స్వరూపమ్. అకార ఉకారో మకార ఇతి**' అనియు, '**ఓం ఇత్యేకాక్షరమ్, నమ ఇతి ద్వే అక్షరే, నారాయణాయేతి పంచాక్షరాణి, ఏతద్వై నారాయణస్యాష్టాక్షరం పదం**' అని చెప్పింది.



ఇక మాండూక్యోపనిషత్ చెబుతూ **..............ఓం ఇత్యేతదక్షరం బ్రహ్మ తస్యోపవ్యాఖ్యానం భూతం, భవత్, భవిష్యదితి సర్వం ఓంకారమేవ యచ్చాన్యత్ త్రికాలాతీతమ్ తదపి ఓంకార ఏవ**' అని ఓంకారాన్ని వర్ణించింది.

'ఓం' అనే ఒక్క అక్షరం 'బ్రహ్మ' అంటే బ్రహ్మమును గురించి ఒక్క అక్షరంలో చెప్పాలంటే అది 'ఓం' అనే అక్షరం. అక్షరం అంటేనే న-క్షరము అంటే నాశనము లేనిది అని అర్థం. ఇక ఆ పైన చెప్పబోయేదంతా కూడా దాని వ్యాఖ్యానమే అన్నది ఉపనిషత్. భూత భవిష్యత్ వర్తమాన కాలాలు అంతా ఓంకారంలోనే నిండివున్నాయి. ఓంకారం ఈ కాలాలన్నింటికీ అతీతమైనది కూడా.

గురువు సృష్టి, స్థితి, లయాలను చేసే బ్రహ్మ, విష్ణు, శివ

స్వరూపములే కాక, వీరిని శాసించే పరబ్రహ్మం కూడా తానే అయి వున్నాడు. ప్రణవమే పరమమై వున్నది కనుకనే దక్షిణామూర్తి స్తోత్రం **'ఓం నమఃప్రణవార్థాయ'** అని వర్ణించింది. ప్రణవ స్వరూపుడు గురుదేవుడు.; కేవలం శుద్ధ జ్ఞాన స్వరూపుడు; నిర్మలుడు; ప్రశాంతుడు అట్టి దక్షిణామూర్తికి నమస్కారము. దక్షిణ దిక్కుగా కూర్చున్న ఈశ్వరుడే దక్షిణామూర్తి. ఆయన 'రూప, నామ, క్రియా రహితుడు. 'ఆకాశవత్' సర్వే సర్వత్రా వ్యాపించి వున్నవాడు. ఆయనే జగత్తునంతా శాసించే ఈశ్వరుడుగా, అజ్ఞానాంధకారాన్ని పటాపంచలుచేసే జ్ఞాన భాస్కర కిరణాలతో మానవ హృదయాలను నింపివేసే గురుదేవుడుగా, మన నిజాత్మ స్వరూపుడుగా వున్నవాడు. ఈశ్వరుడు, గురువు, ఆత్మ అని ఏ పేరుతో పిలిచినా, మూర్తులు వేరైనా, ఆకాశంలా సర్వత్రా నిండి వున్న ఆ స్వరూపాలన్నీ ఆయనే. సర్వలోకాలకీ ఆయనే గురువు (దక్షిణామూర్తి) భవ రోగానికీ వైద్యం చేసే మహావైద్యుడాయనే. సర్వ విద్యలకీ నిధి ఆయనే.

- సశేషం



# మనశ్శతకము

(గత సంచిక తరువాయి)

పరశురామపంతుల లింగమూర్తి కవి

(తాత్పర్యము: కుమారి సన్నిధానం కాళీమాత)

9. **మంత్రంబులన్నియును నడు, మంత్రంబులు లేనిపోని మాటలు సుమి యీ**
**తంత్రములఁ జెడక యాపర, తంత్రుని రాముని దలంపు తలఁపునమనసా.**

తాత్పర్యము: సిధ్ధులను కలుగజేసే భౌతిక మాయాజాలములైన మంత్రములు స్వల్ప ప్రయోజనకారులు. ఇటువంటి వాటినిబడి జీవితము వ్యర్థము చేసికొనక స్థిర సౌఖ్యములనిచ్చు రాముని తలువుము మనసా!

10. **జపములు తపములు వ్రతములు, విపరీతపుడాంబికములు వేషము లగుటం**
**జపలత నొందక సద్గురు, కృపరాముని శరణుఁబొంది కేరుముమనసా.**

తాత్పర్యము: డాంబిక వేషములతో గూడిన జప, తప, వ్రతములతో చంచల మనస్సుతో ఉండక శ్రీరామచంద్రుని, సద్గురు శరణము పొందిన సుఖమున మను మనసా!

11. **గారడపు యోగములచే, నాఁబడిఁ బొందక ప్రపంచమంతయు మాయా**
**కారం బని చూచుచు సీ, తారాముని సాక్షిగాగ దలఁపుము మనసా.**

తాత్పర్యము: గారడీవాని మాయాజాలముల వంటి భోగ ఐశ్వర్యములనెడి యోగముల పడి బాధలు పడక, ఈ ప్రపంచమంతా మాయ అని తెలిసుకొని ఆత్మసాక్షియైన శ్రీ సీతారాముల యందు స్థిర చిత్తుడవగుము!

12. **అంబరగమనాదులు గడు, డంబమ్ములు మానవులనొడంబటిచెడి యో**
**గంబు లవిగోరక నిరా, లంబుని భద్రాద్రి విభు దలంపుము మనసా.**

తాత్పర్యము: ఆకాశ విహారంబు వంటి డంబములతో కూడిన యోగంబులు మానవులను లక్ష్యము నుండి తప్పు త్రోవకు మరల్చును. కావున అటువంటివి కోరక నిరాలంబుడైన భద్రాద్రి శ్రీరాముని తలువుము మనసా!

\- సశేషం

# విశ్వాసమే రక్ష

-ఎన్. కుట్టీ

అది మంచి ఎండాకాలం! ఎండ మండిపోతోంది! ఆ మండుటెండలో ఒక గొఱ్ఱెల కాపరి చెమటలు కారిపోతుండగా నడుస్తూ తన గ్రామానికి పోతున్నాడు. బాగా అలసిపోయినందువల్ల ప్రక్కనే వున్న ఒక చెట్టు నీడలో కాసేపు విశ్రాంతి తీసుకుందామని చల్లదనం కోసం కూర్చున్నాడు. అదే సమయంలో అదే గ్రామానికి నడచి వెడుతూ వున్న ఒక పండితుడు కూడా ఎండకి తాళలేక విశ్రాంతి కోసం అదే చెట్టు క్రింద మరొకవైపు చల్లదనానికి కూర్చున్నాడు.

అదే సమయానికి నారద మహర్షి ఆ మార్గం గుండా ప్రయాణిస్తున్నాడు. పండితుడు నారద మహర్షికి నమస్కరించి 'స్వామీ! మీరు ఏ పని మీద వెడుతున్నారు? ఎక్కడికి వెడుతున్నారు?' అని ప్రశ్నించాడు. అప్పుడు నారదుడు 'ఓ పండితోత్తమా! నేను బ్రహ్మదేవుని కలవటం కోసమని బ్రహ్మలోకం వెడుతున్నాను' అని చెప్పాడు. అది విన్న పండితుడు 'ఓ నారద మహర్షీ! నా దొక చిన్న విన్నపం, మీరు బ్రహ్మదేవుని కలిసి నేను ఎప్పుడు తరిస్తానో అడిగి, నాకు మీ తిరుగు ప్రయాణంలో ఏ సంగతి తెలియజేయండి దయచేసి' అని వినయంగా అడిగాడు. ఇదంతా వింటున్న గొఱ్ఱెల కాపరి కూడా నారద మహర్షికి వినయంగా నమస్కరించి, 'స్వామీ! నేను ఏమీ చదువుకోలేదు, నాకు ఏమీ తెలియదు. నేను గొఱ్ఱెల కాపరిని. మీరు దయచేసి నా విషయం కూడా బ్రహ్మదేవుని అడిగి ఎప్పుడు తరిస్తానో నాకు మీ తిరుగు ప్రయాణంలో విషయం తెలియజేయండి. మీరు తిరిగి వచ్చేవరకూ నేను ఇక్కడే వుంటాను' అని ప్రార్థించాడు. నారద మహర్షి అందుకు సమ్మతించి, ఆ ఇద్దరినీ కూడా ఆశీర్వదించి అక్కడ నుండి బయలుదేరి వెళ్ళాడు.

నారద మహర్షి కొంతకాలానికి తిరుగు ప్రయాణంలో ఆ మార్గం గుండా వస్తూ ఆ చెట్టు దగ్గర ఆగి, ఆ పండితుడిని, గొఱ్ఱెల కాపరిని కలిసి, మొదటగా ఆ పండితునితో 'ఓ పండితోత్తమా! నీవు చెప్పినట్లే బ్రహ్మదేవుని అడిగాను. ఆయన నీవు ఈ చెట్టుకు ఎన్ని ఆకులు వున్నాయో, అన్ని జన్మలు ఎత్తి అప్పుడు తరిస్తావు' అన్నాడని చెప్పాడు. ఆ పండితుడు కోపంతో 'నేను సదా దేవుని గురించి ప్రసంగాలు చేస్తూ, రామాయణ,

భాగవతాలు బోధిస్తూ రాత్రింబవళ్ళూ మోక్షం కోసం కష్టపడుతుంటే, నాకు ఈ జన్మలో కాకుండా ఆ బ్రహ్మదేవుడు ఈ చెట్టుకు ఎన్ని ఆకులున్నాయో అన్ని జన్మలు ఎత్తాలంటాడా! ఆ దేవునికి అసలు ఏమీ తెలియదు' అని విసుక్కుంటూ, నారదుల వారికి నమస్కరించకుండా అక్కడి నుంచి విసవిసా వెళ్ళిపోయాడు.

అప్పుడు నారద మహర్షి ఆ చెట్టుకి రెండో వైపు కూర్చుని వున్న ఆ గొర్రెల కాపరి దగ్గరకు వచ్చి, 'నీ గురించి బ్రహ్మదేవునికి చెప్పాను. ఆయన ఏమన్నారంటే ఈ చెట్టుకి వున్న ఆకులన్నీ ఎప్పుడు రాలిపోతాయో, అప్పుడు నీకు జన్మరాహిత్యం కలుగుతుంది' అని చెప్పారని నారదుడు చెప్పీ చెప్పగానే టపటప మంటూ ఆ చెట్టు ఆకులన్నీ కూడా అప్పుడే రాలిపోయాయి. ఒకే ఒక్క ఆకు వున్నది ఆ చెట్టుకి. అప్పుడు నారదమహర్షి 'నాయనా! కాపరీ! నీవు చేసుకున్న పుణ్యఫలాల వల్ల నీకు అన్ని జన్మలు అయిపోయి ఇక ఒకే ఒక జన్మ వున్నది. అదే ఈ జన్మ. ఈ జన్మ అవగానే నువ్వు తరిస్తావు. నీవు గొర్రెల కాపరివైనా కూడా నీ వృత్తి ధర్మాన్ని చక్కగా పాటిస్తూ, నీ సంసారాన్ని న్యాయబద్ధంగా పోషిస్తూ, ఏ చదువూ లేకపోయినా కుడా మనస్సులో సదా భగవంతుని స్మరిస్తూ వుంటావు కనుక నీకు ఈ జన్మే ఆఖరు జన్మ. ఆ పండితునికి ఇంకా చాలా జన్మలు వున్నాయి. ప్రవచనాలు చెప్పవచ్చు, రామాయణ మహాభారతాలు భగవద్గీత ఎన్నైనా చెప్పవచ్చు, కానీ, మనస్సు ఆ భగవంతుని మీద వుండక, ఎల్లప్పుడు మనస్సు ఐహికముల మీదే వుంటే ఏం లాభం?' అని అంటూ వుండగానే ఆ ఒక్క ఆకు కూడా రాలిపోయింది!

అప్పుడు ఆ గొర్రెల కాపరికి బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై, 'నాయనా! నీకు ఈ క్షణమే మోక్షాన్ని ప్రసాదిస్తున్నాను' అని అంతర్ధానమయ్యాడు. మరుక్షణంలోనే ఆ కాపరి శివసాయుజ్యం పొందాడు.

భగవంతుడు మనలో చూసేది మన యొక్క భక్తి, విశ్వాసాలే కానీ, మన ధన ధాన్యాలు, కీర్తి ప్రతిష్ఠలు, పాండిత్యము కాదు.

# నేనే కనుక లేకపోతే

-భోగరాజు భారతి

మనం జీవితంలో చాలా సందర్భాలలో ఇలాగ ఒక్కింత భావిస్తుంటాము. కానీ కొంచెం ఆలోచిస్తే..... ఇది చదవండి.

అశోకవనంలో రావణుడు సీతమ్మవారి మీద కోపంతో కత్తి తీసి, ఆమెను చంపడానికి ముందుకు వెళ్ళినప్పుడు హనుమ ఎవరినుంచైనా కత్తి తీసుకుని రావణుడి తలను ఖండించాలని అనుకున్నాడు. కానీ, మరుక్షణంలో మండోదరి రావణుని చేతిని పట్టుకుని ఆపడాన్ని చూసి, ఆశ్చర్యచకితుడయ్యాడు. 'నేనే కనుక ఇక్కడ లేకపోతే సీతమ్మను రక్షించేవారెవరు?' అనేది నా భ్రమ అన్నమాట అనుకున్నాడు హనుమంతుడు. సీతామాతను రక్షించేపనిని నా రామ ప్రభువు రావణుడి భార్యకే అప్పగించాడు. 'ఎవరి ద్వారా ఏ కార్యాన్ని చేయించుకోవాలో వారి ద్వారానే ఆ పనిని చేయించుకుంటాడు ప్రభువు' అని అర్థం అయింది హనుమకు.

మరింత ముందుకు వెడితే, త్రిజట స్వప్నం గురించి చెబుతుంటే విన్నాడు. తనకు ఒక కల వచ్చిందని, ఆ కలలో లంకకు ఒక కోతి వస్తుందని లంకను కాల్చివేస్తుందని చెప్పి దానిని నేను చూశాను అన్నది. ఇప్పుడు హనుమకు మరింత ఆశ్చర్యం కలిగింది. తనకు సీతను చూసి రమ్మనమని మాత్రమే ప్రభువు ఆజ్ఞాపించాడు, కానీ లంకను కాల్చి రమ్మనమని చెప్పలేదు. అయినా నాకు లంకను కాల్చడం ఎలా సాధ్యమవుతుంది? నేను ఇప్పుడు ఏం చేయాలి? అని కొంతసేపు ఆలోచించి సరే ప్రభువు ఇచ్ఛ ఎలా వుంటే అలా జరుగుతుంది అనుకున్నాడు.

తరువాత హనుమంతుని చంపమని సైనికులను పంపించాడు రావణుడు. కానీ, హనుమ ఏమీ చేయకుండా నిలబడ్డాడు. అదే సమయంలో విభీషణుడు వచ్చి 'అన్నా! దూతను చంపడం న్యాయం కాదు' అన్నాడు. రావణుడు వెంటనే ఒప్పుకుని 'కోతిని చంపవద్దు. కోతులకు తోక అంటే చాలా ఇష్టం. ఆ తోకకు నిప్పు పెట్టండి' అన్నాడు. అప్పుడు త్రిజట స్వప్నం గుర్తుకు వచ్చింది. ఆ కల నిజం కాబోతోంది అనుకున్నాడు. నిజంగా తననే స్వామి ఆ పని చేయమంటే ఎలా

చేయగలడు? ఆ నూనె, గుడ్డలు, నిప్పు ఎలా తేగలడు? అంటే తనను రక్షించే భారం విభీషణుడికి అప్పగించి, ఆ నిప్పు పెట్టే కార్యక్రమం స్వయంగా రావణుని చేతనే చేయించాడు ప్రభువు.

అందుకే ప్రియ భక్తులారా! ప్రతి పనీ ఈశ్వరేచ్ఛ ద్వారానే జరుగుతుంది. మనం నిమిత్తమాత్రులమే అనే ఎఱుక కలిగి భగవంతుని దాసానుదాసులలో అతి చిన్నవాళ్ళం అని గ్రహించుకుని గాఢమైన భక్తి విశ్వాసాలు కలిగివుందాం! శ్రీ గురుదేవులు ఆ రూపంలోనూ, శ్రీ మాతాజీవారి రూపంలోనూ మనకీ విషయాలను ఎప్పుడూ చెబుతూనే వుంటారు. మన అనుభవంలో కూడా ఏదైనా పని ఎలా అవుతుంది అనుకునే లోపునే స్వామి దయతో జరిగిపోతుంది. అందుకే మనం ఏమీ కోరుకోనక్కర్లేదు. మనకు ఏమి కావాలో వారికే తెలుసు. ఇది మీ దయ కదా ప్రభూ! అని మనసారా కృతజ్ఞతా పూర్వకంగా నమస్కరించుకుంటూ వుందాం.

### *పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు*

** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును**

**జూన్ 2023**

4 ఆది - జ్యేష్ఠ పూర్ణిమ - శ్రీ సద్గురుపాదపూజ

13 మంగళ - శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ

29 గురు - తొలిఏకాదశి - శ్రీ సద్గురుపాదపూజ

**జులై 2023**

3 సోమ - ఆషాఢ(గురు)పూర్ణిమ - శ్రీ సద్గురుపాదపూజ

12 బుధ - శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ

# అగస్త్య హృదయం

(గత సంచిక తరువాయి) - వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

**రావణం ప్రేక్ష్య హృష్టాత్మా యుద్ధాయ సముపాగమత్।**
**సర్వయత్నేన మహతా వధే తస్య ధృతో భవత్॥**

తాత్పర్యము - ఎంతో సంతుష్టుడై వున్న శ్రీరాముడు రావణుని చూసి యుద్ధం చేయడానికి ఉపక్రమించాడు. గట్టి పూనికతో, సర్వ ప్రయత్నములతో వానిని వధించడానికి కృతనిశ్చయుడయ్యాడు.

ఈ శ్లోకము ద్వారా వాల్మీకి మహర్షి గురువాక్యము మీద శ్రద్ధ పెట్టి సాధన చేసిన సాధకుడు వుండే పరమానంద స్థితిని తద్వారా వారు పొందే పరిపూర్ణతను గుహ్యముగా తెలియజేస్తున్నారు.

ఆదిత్య హృదయం మొదట్లో **రావణం చాగ్రతో దృష్ట్వా సమరే చింతయాస్థితం** అంటూ రణరంగమునకు తిరిగి వస్తున్న రావణుని చూసి చింతతో వున్న శ్రీరాముడిని ఇప్పుడు **రావణం ప్రేక్ష్య హృష్టాత్మా** అని ఎంతో ఆనందముగా చింతారహితుడై వున్నట్లు అభివర్ణిస్తున్నారు. కథా పరంగా తన గురుదేవుల ద్వారా ఉపదేశము పొందిన శ్రీరాముడు రావణుని వధ జరగబోతోందన్న విశ్వాసంతో సంతోషిస్తున్నట్లు అన్వయించబడింది. కానీ, లోతుగా పరిశీలిస్తే **ఆదిత్యం ప్రేక్ష్య జప్త్వాతు పరంహర్ష మవాప్తవాన్** అని ముందు శ్లోకములో ప్రస్తావించినట్లు అగస్త్యుల ఉపదేశానంతరం తదేక దీక్షగా సాధన చేసి, పరమానందం పొందిన శ్రీరాముడు **నందతి నందతి నందత్యేవ** అన్న విధముగా ఆనందానుభూతిలో వున్నాడని, **హృష్టాత్మా** అన్న పదం తెలియజేస్తోంది. **స్వాత్మాన్యేవ సదాతుష్టః** అని చెప్పినట్లు స్వాత్మానందములో మునిగి వున్న సాధకుడు నిరంతరం సంతుష్టుడై వుంటాడన్న విషయాన్ని ధృవీకరిస్తూ స్వాత్మారామ స్థితిలో ఓలలాడుతున్న సాధకుని స్థితిని మహర్షి గుహ్యంగా దర్శింపజేస్తున్నారు.

**యుద్ధాయ సముపాగమత్** అన్న ప్రస్తావనలో యుద్ధము చేయడానికి సిద్ధమైన శ్రీరామునితో పాటుగా గురుబోధానంతరము తన కర్తవ్యమును నిర్వహించబోయే కర్మయోగియైన సాధకుడిని గుర్తించాలి.

**సర్వయత్నేన మహతా** అన్న పద ప్రయోగము ద్వారా శ్రీరాముడు యధాశక్తినీ, యావచ్ఛక్తినీ ఉపయోగించి ప్రయత్నించినట్లు భావన

కలుగుతుంది. కానీ నిజానికి గురువాక్కులపై పరిపూర్ణ విశ్వాసముతో చేసే ఒక్క ప్రయత్నమే సర్వ ప్రయత్నములతో సమానము. గీతోపదేశము తరువాత అర్జునుడు చేసిన ప్రయత్నము అటువంటిదే. ఆనాడు గణాధిపత్యం కోసం జరిగిన పోటీలో తన తల్లిదండ్రులైన పార్వతీ పరమేశ్వరులనే గురువులుగా భావించి, వారి చుట్టూ చేసిన ప్రదక్షిణలే సర్వతీర్థములలో స్నానం చేసిన ఫలితాన్ని ఇచ్చి వినాయకుడిని గణాధిపతి చేయడం మనందరికీ తెలిసినదే కదా!

**తస్యవధేధృతో భవత్** అన్న ప్రస్తావన రావణుని వధించాలన్న పట్టుదలతో పూనిక కలిగిన శ్రీరాముని వర్ణిస్తోంది. అంతేకాక ఇక రావణ వధ తప్పదన్న సత్యమునూ, దాని వెనుక గల సంకల్పము యొక్క దృఢత్వమును (ధృతిని) తెలియజేస్తోంది. అయితే దానిని కేవలం దశకంఠుని మీద శ్రీరాముని విజయముగానే కాక, దశేంద్రియముల మీద విజయం సాధించి వాటిని నియంత్రణలోనికి తీసుకురాగలిగిన సాధకుడి గురించి తెలిపిన వివరణగా అర్థం చేసుకోవాలి. ఆ విజయం సాధించడానికి సాధకుడికి విశ్వాసముతో పాటుగా నిశ్చయమైన పట్టుదల, ధృతి అవసరము. అది గురుదేవుల అపారమైన కృపవలన మాత్రమే సాధ్యము. అటువంటి పట్టుదలను సాధకులైన మనందరిలో కలిగించే శ్రీబాబూజీ మహరాజ్‌వారిని మనము ప్రీతిగా **ఓం ధృతిమతే నమః** అని స్తుతించుకుంటాము కదా!

ఈ విధంగా ఈ శ్లోకము గురూపదేశము ద్వారా ఆనందించిన శ్రీరాముడు వ్యాకులతను వదలి రావణ వధకు ఆయత్తమైన వైనముతో పాటుగా గూఢంగా సాధకుని యొక్క నిరతానందానుభూతినీ, దశేంద్రియములపై సాధించవలసిన విజయమునూ అందుకు కావలసిన ధృతినీ మహర్షి వివరిస్తున్నారు.

- సశేషం

## మమకారం

- పాలూరి కాళీప్రసాద్

పూర్వం ఒక అడవిలో ఒక కోతి నివసించేది. దానికి లేకలేక ఒక పిల్ల పుట్టింది. దానితో ఆ పిల్లని ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకొనేది. ఒక్క క్షణం కూడా ఆ పిల్లని వదిలిపెట్టి ఉండేది కాదు. తను నిద్రలోనో, లేదా ఏదో వ్యాపకంలోనో ఉండగా ఏ చిన్న శబ్దమయినా 'అమ్మో! నా పిల్లకి ఏదో ఆపద కలిగింద'ని ఉలిక్కిపడుతూ ఉండేది.

పిల్ల పెరిగి పెద్దదవుతూ ఉంటే తననెక్కడ వదిలేసి వెళ్ళిపోతుందో అని ఆ తల్లి బెంగపెట్టుకునేది. దానితో ఆ పిల్ల ఎంత అల్లరి చేసినా, చుట్టుప్రక్కల జంతువులతో తనకు ఎన్ని తలనొప్పులు తెచ్చిపెట్టినా ఏమీ అనేది కాదు. వాటి సంఘంలోని కోతులన్నీ మొదట్లో 'ఏదో చిన్న పిల్లలే' అని సహించినా తరువాత తల్లిని హెచ్చరించేవి. అయినా సరే ఆ తల్లి 'ఊర్లో అందరి కళ్ళూ నా పిల్లమీదే. దానికి దిష్టి పెడుతున్నారు. అది ఆనందంగా ఉంటే చూసి ఓర్చుకోలేక పోతున్నారు' అనుకొనేదే కానీ తన తప్పు తెలుసుకోలేక పోయింది.

తను ఎంత అల్లరి చేసినా తల్లి ముద్దు చేయడం, అలాగే తనని ఎప్పుడూ వదిలిపెట్టకుండా ఉండటంతో ఆ కోతిపిల్లకి సంఘంలో ఎలా బ్రతకాలో, మంచిచెడులు ఎలా గుర్తించాలో, ఎక్కడ ఎలా మెలగాలో తెలియకుండా పోయింది. ఒకనాడు ఆ అడవిలో కొంతభాగాన్ని నరికివేసి అక్కడ పెద్ద ఫాక్టరీ కట్టాలని కొంతమంది మనుషులు వచ్చారు. వారిని చూడగానే భయంతో జంతువులన్నీ పారిపోయాయి.

వారు ఉదయం కొంత పనిచేసి, మధ్యాహ్నం భోజనానికి వెళ్ళారు. సరిగ్గా అప్పుడు ఈ కోతిపిల్ల అటుగా వెళుతూ వారి పనిముట్లను చూసింది. అటు వెళ్ళవద్దని మిగిలిన కోతులన్నీ అరుస్తున్నా వినకుండా వెళ్ళి అక్కడ ఉన్న రంపంతో ఆడుకోవడం మొదలుపెట్టింది. ఈ అరుపులకు వులిక్కిపడి తన పిల్లకు ఏమైందోనని తల్లి పరుగు పరుగున వచ్చింది. కానీ అప్పటికే సమయం మించిపోయింది. రంపం మీదినుంచి అటు ఇటు గంతులు వేస్తున్న కోతిపిల్ల పట్టుదప్పి రంపం మీద పడి ఒక కాలు తెగిపోయింది.

తన కళ్ళముందే అవిటిదయిపోయిన పిల్లను చూసుకొని ఆ తల్లి గుండెలవిసేలా రోదించింది. అటుగా వెళుతున్న ఒక పులి ఈ

దృశ్యాన్ని చూసి ఏమయిందని ఆరా తీసింది. విషయం తెలుసుకున్న పులి ఆ కోతిని ఓదారుస్తూ 'చూడు మిత్రమా! మనందరం ప్రకృతి సహజంగా పిల్లల్ని కంటాము. వారి ఆలనా పాలనా చూసుకోవటం, వారిని ప్రేమగా పెంచడం మన బాధ్యత. అదే సమయంలో వారిని క్రమశిక్షణతో కూడా పెంచాలి. ఏది మంచో ఏది చెడో వారంతట వారు తెలుసుకొనేలా తీర్చిదిద్దాలి. వారికి అవసరానికి కావలసినవి సమకూరుస్తూ వారు తెలివిగా తమ కాళ్ళమీద తాము నిలబడగలిగేలా పెంచడం ప్రేమ అనిపించుకుంటుంది. అలా కాకుండా వారిని వదలలేక నిరంతరం వెంట ఉంటూ, అన్నీ నువ్వే చేస్తూ, వారికి స్వేచ్ఛను, స్వతంత్రంగా బ్రతికే తెలివిని ఇవ్వలేకపోవడం, వారు లేకుండా నేను జీవించలేను అనుకోవడం, నువ్వు లేకుండా వారు జీవించలేని స్థితి కల్పించడం మమకారం అవుతుంది. ప్రేమ స్వేచ్ఛకు, ఉన్నతికి దారితీస్తే మమకారం బంధానికి పతనానికి దారితీస్తుంది.

ఇప్పటికైనా మించిపోయింది ఏమీ లేదు. ఒక కాలు పోయినా భగవంతుని దయవలన నీ బిడ్డ బ్రతికే ఉంది. కనుక నీ మమకారాన్ని విడిచిపెట్టి, ప్రేమతో దానికి కావలసిన సహకారాన్ని అందిస్తూ మంచిచెడుల విచక్షణ కలిగేలా పెంచు' అని బోధించింది.

**నాయిల్లు నాయాస్తి నాభార్యయందువు**
**నా పిల్లలో యంచు మురిసిపోదువు**
**నాది నాదన్న వాడు బంధాల పాలౌను**
**కాళీ ప్రసాదు మాట కాంతిబాట!**



# ధ్యాన ధ్యాతృ ధ్యేయరూపా

- భాగవతుల హనుమత్ జయప్రద

2011లో నేను Bangaloreలో ఒక IT companyలో Senior Consultant గా పనిచేస్తున్నాను. ఒక రోజు బాగా మీటింగ్స్ , వర్క్ వుండటం వల్ల చాలా లేట్ అయింది. నేను టైం చూసుకోలేదు. సుమారు రాత్రి 11.30 అయి ఉంటుంది. కంపెనీ బస్సు అయితే last బస్సు 9.30కి వెళ్ళిపోతుంది. నేను పనిలో పడిపోయి అసలు గమనించలేదు. సరే అని 11.30 కి ఇంటికి వెళ్దాం అని క్యాబ్ బుక్ చేశా. తీరా ఎక్కే టైంకి చూస్తే బయట ఒకటే వాన. ఇంకా ఆ డ్రైవర్ కూడా ఫుల్‌గా తాగేసి ఏదేదో మాట్లాడుతున్నాడు. వెంటనే cancel చేసి మళ్ళీ ఆఫీసులోకి వచ్చాను. రాత్రి పూట ఆఫీసులో ఉండాలంటే మేనేజర్ పర్మిషన్ వుండాలి. నేను ఆ రోజు ఉన్న వర్క్ లోడ్‌లో ఏదీ గమనించలేదు. చాల సేపు ఏం చెయ్యాలో తెలియక కూర్చున్నా. ఇక ఏదైతే అదే అవుతుందిలే ఏదో ఒక ట్రాన్స్‌పోర్ట్ పట్టుకుని వెళ్దాం అని, ఆఫీసులో నుండి బయటకి వచ్చా. టైమ్ 2.30 అయింది. వానలో మొత్తం నేను నా లాప్‌టాప్‌తో పాటుగా తడిచిపోయా. ఏ వాహనం కూడా ఆపడం లేదు. ఎవరూ లిఫ్ట్ ఇవ్వలేదు. ఇంక చేసేది ఏంలేదు. ధ్యానించడం తప్ప.

అప్పుడు సడెన్‌గా ఒక కారు నా ముందు ఆగింది. ఆయన డోర్ ఓపెన్ చేసి ఎక్కు నేను దిగబెడతా అన్నాడు. సరే అని ఎక్కి నేను దారి మధ్యలో ఆయన పేరు అడిగి థాంక్స్ చెప్పి అయన ఫలానా అని, ఇన్‌ఫోసిస్‌లో పని చేస్తా అని చెప్పాడు. సరే అని నేను కార్ దిగి ఇంటి గేట్ ఓపెన్ చేసి వెనక్కి తిరిగి చూశా. అక్కడ కారు లేదు, ఎవరు లేరు. అసలు కారు మిస్‌అయ్యే వీలు లేదు ఒక టర్నింగ్ తీసుకుంటే గాని కారు రోడ్డు మీదకు దారి లేదు. నేను కంగారులో చూసుకోలేదు అనుకున్న. తరువాత రోజు ఎందుకో ఇన్‌ఫోసిస్‌లో పనిచేసే ఫ్రెండ్‌ని కాల్ చేసి అడిగా నిన్న ఒక ఆయన నాకు హెల్ప్ చేశారు. నేను సరిగ్గా థాంక్స్ కూడా చెప్పలేదు అని. అసలు అలాంటి పేరుతో ఎవరు లేరు అని ఎంప్లాయి డేటాబెస్‌లో చెక్ చేసి చెప్పింది. ఈ విషయం ఇప్పటికి తలచుకుంటే చాల ఆశ్చర్యంగా అనిపిస్తుంది నాకు. మనలోనే ఉంటూ, మనతోనే ఉంటూ, మనకి రక్షణగా ఉంటూ, అన్నింటిలో ఉండే

విశ్వరూపిణి అయిన అమ్మ చరణారవిందములకు నమస్సుమాంజలులు.

కానీ ఇక్కడ ధ్యానించడం అనే ఒక విషయాన్నీ గురించి విచారణ చెయ్యవలసి వస్తోంది. మనకి కష్టం వచ్చినప్పుడు మాత్రమే భగవంతుని ధ్యానిస్తున్నాము. మిగతా సమయాలలో మర్చిపోతున్నాము. ఒకసారి రమణ మహర్షిని ఒకరు ఒక ప్రశ్న అడిగారు

ప్రశ్న : మనం ఇతరులతో ఎలా ప్రవర్తించాలి ?

రమణ మహర్షి : ఇతరులు అనే వారే లేరు

రమణ మహర్షి జ్ఞాని కనుక ఇటువంటి సమాధానం ఇచ్చారు. ఇందులో చాల లోతైన అర్థం వున్నది. మాములు ప్రాపంచిక విషయాలలో కూడా ఇది వర్తిస్తుంది. మనం ఎవరినైనా ప్రేమతో చూడాలి, మనం ఎలాంటి మర్యాద కోరుకుంటామో అటువంటి మర్యాదనే ఇతరులకి ఇవ్వాలి అని మనకి తెలుసు. కానీ ఒక సద్గురువు దగ్గర సాధనలో వున్న శిష్యుల యొక్క ధ్యేయం ఇంతవరకేనా? ధ్యేయం ఎప్పుడు కూడా ఆ ధ్యేయాన్ని చేరడమే. అప్పుడే మనకి ఇతరులకి భేదం లేని అభేద దృష్టి వస్తుంది. కాని అది ఎలా సాధ్యం? ధ్యానం అందుకు కుదరాలి కదా? ధ్యానంచేసే ధ్యాత, చేయబడే ధ్యానం, చేరుకోవాల్సిన ధ్యేయం అన్ని అమ్మ స్వరూపమే అయి ఉన్నవి.

శ్రీబాబూజీ మహారాజ్ చెప్పారు, ఒక ఉప్పు బొమ్మ సముద్రపు లోతు చూద్దాం అని బయలుదేరింది. అక్కడికి వెళ్ళి సముద్రంలో దూకింది. ఇపుడు ఆ ఉప్పు బొమ్మే సముద్రంలో లయం అయింది. ఇందులో ఒక విషయం ఉంది ఉప్పు బొమ్మకి ముందు అసలు అనిపించింది సముద్రం దగ్గరకు వెళ్ళాలి అని. అన్ని అవధులు దాటి వెళ్ళి చేరింది.

ఒక శిష్యుడు గురువుగారితో బ్రహ్మము అంటే ఏమిటి అని అడిగాడు. దానికి అయన నువ్వు వెళ్ళి కొద్దిరోజులు సాధన చెయ్యి అప్పుడు వచ్చి చెప్పు అని అన్నారు. కొద్దిరోజులు అయ్యాక ఆ శిష్యుడు నాకు అన్నం పరబహ్మ స్వరూపం అని అర్థం అయింది అండి. అన్నం తింటే అంతకన్నా గొప్ప అనుభూతి లేదు అన్నాడు. వెంటనే గురువుగారు ఇంకా సాధన చెయ్యి అన్నారు, కొన్నిరోజుల సాధన తర్వాత ప్రాణం బ్రహ్మము అన్నాడుట, గురువు గారు ఇంకా సాధన చెయ్యి అన్నారు, ఆ తర్వాత

కొన్నిరోజులకి శిష్యుడు వచ్చి మనస్సు అన్నిటికంటే గొప్పది అండి, మనస్సే బ్రహ్మము అన్నాడు. గురువుగారు, ఇంకా సాధన చెయ్యి అన్నారుట, కొన్ని రోజుల తర్వాత, మనస్సు కన్నా విజ్ఞానం చాల గొప్పది అండి అదే బ్రహ్మము అన్నాడుట. గురువుగారు ఇంకా సాధన చెయ్యాలి అని అన్నారు. చివరికి అన్నిటికి కన్నా ఆనందం గొప్పది అని, అదే బ్రహ్మము అన్నాడా శిష్యుడు. అప్పుడు గురువుగారు చెప్పారు, వీటి అన్నిటిలో వుంటూ, వీటికి అతీతంగా ఏదైతే ఆధారమై ఉందో అది బ్రహ్మము అని.

ఇక్కడ మనకు మనమే ఒక ఉదాహరణగా తీసుకుందాం. మనం ఏదైతే అన్నమయ (అన్నము వలన పుట్టి వృద్ధిచెందు స్థూల భౌతిక దేహము), ప్రాణమయ (పంచకర్మేంద్రియములు, పంచప్రాణములు), మనోమయ (మనస్సు, పంచ జ్ఞానేంద్రియములు), విజ్ఞానమయ (బుద్ధి, పంచేంద్రియములు), ఆనందమయ కోశము (ప్రియ, మోద, ప్రమోదములనెడి వృత్తులతో అజ్ఞానమే ప్రధానముగా కల అంతఃకరణము)లతో ఉన్నామో అవి అజ్ఞానికి, జ్ఞానికి కూడా వున్నాయి. వీరిరువురికి బేధము- అజ్ఞాని వాటితో తాదాత్మ్యత చెంది అవే నేనన్న భ్రమకు లోనవుతాడు. జ్ఞాని కేవలము వాటిని వుపకరణములుగా చూస్తాడు.

కానీ ఎప్పుడైతే జ్ఞానదృష్టితో అమ్మను దర్శించడం మొదలు పెడతామో అప్పుడు ఆనందమయ కోశాన్ని కూడా దాటుకుని అమ్మ, **సుధాసారాభివర్షిణిగా** మనకు కనపడుతుంది. అప్పుడు దేనిని మనం ధ్యానించాలి? ఇక్కడ ధ్యాత ఎవరు? అన్నింటా నిండి ఉన్నది అమ్మే. మన శరీరంలో కూడా నిండి ఉన్నది అమ్మే (**పంచకోశాంతరస్థితా**) కనుక అమ్మనే నిరంతరం ధ్యానించాలి. అటువంటి తత్త్వస్థితిలో ఉన్న వారు ధర్మ, అధర్మ వివర్జితులై వుంటారు. వారికి ధర్మమూ అధర్మము ఏవీ అంటవు. ఇదే మనము సద్గురు పాదుకాస్తవము లో పారాయణ చేసుకుంటున్నాము

**పంచకోశ గుణత్రయాది సమస్త ధర్మ విలక్షణం**

**ప్రాతరేవహి మానసాంతర్భావయే గురు పాదుకాం**


బ్రహ్మచర్యం
ముకుంద్
మాఅందరిలో బ్రహ్మచారి మీరే ఓ వశిష్ఠ మునీంద్ర!
మీరు నన్ను పెళ్లిచేసుకుని, వెయ్యిమంది పిల్లల్ని కన్నారు. మిమ్మల్ని బ్రహ్మచారి అని ఎందుకు పిలుస్తున్నారండి?
సమయం వచ్చినప్పుడు నేనే చెప్తాలే.


వెళ్ళి తడిబట్టలు
కట్టుకుని తల మీద
నీళ్ళ కుండను
పెట్టుకుని హరి
నామ స్మరణ చేస్తూ
మూడు ప్రదక్షిణలు
చేయి.
3


వెళ్ళి మీ అమ్మని
ముట్టుకోకుండా తన శరీరం
మీద గాజు పెంకులతో రక్తం
వచ్చేలా గీరండి.
4


5


ఇదిగోండి స్వామి కుండ.
6


ఏంటి నాకు ఇలా రక్తం
కారుతోంది!
7


మన కొడుకులు నిన్ను రక్తం వచ్చేలా గీరినా సరే
హరినామ స్మరణ మీద నీ మనస్సు లగ్నమయి
ఉన్నందుకు నీకు తెలియలేదు కదా! నేను కూడా
నా మనస్సుని బ్రహ్మము మీద లగ్నం చేసి
ఉంచుతాను కాబట్టి బైట ఏమి చేసినా లోపల నేను
బ్రహ్మచారినే.
8

# బాల గంగాధరనాథ స్వామి

(గత సంచిక తరువాయి) సేకరణ - మురళీ

సాధారణంగా అజ్ఞానం వల్లనే అసహనం ఒక వ్యక్తిని పట్టుకుంటుంది, ఎక్కువగా ఇతరుల అభిప్రాయాలను విస్మరించినప్పుడు. ఇది అన్ని కలహాలకు మరియు యుద్ధాలకు ప్రధాన కారణం. అహం మరియు అసూయ అనే సోదరీమణులు అగ్నిని ఎక్కువగా అభిమానిస్తాయి మరియు మనిషి కోపంతో అంధుడవుతాడు. అతను సరిగ్గా ఆలోచించలేడు, తద్వారా ఘర్షణకు దారి తీస్తుంది. తమను తాము మేధావులుగా చెప్పుకునే వారు కూడా ప్రతీకారం తీర్చుకోవడం తరచూ గమనిస్తూ ఉంటాము. సహనం ఒక గొప్ప సమగ్ర శక్తి. ఈ అసహనం అనేది ఒక గొప్ప విఘటన శక్తిగా కాకుండా, మానవాళి యొక్క మతాన్ని అనేక సమూహాలుగా విభజించి మరియు ఉపవిభజన చేసి, మరొకదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న అనేక శాఖల రూపంలో దీనిని చూడవచ్చు. అన్నింటికీ కారణం ప్రేమ మరియు సహనం యొక్క స్థిరమైన శక్తి విస్మరించడం.

మెటీరియల్ సైన్స్ రంగంలో మానవజాతి విపరీతమైన పురోగతి సాధించినప్పటికీ, అతని స్వంత ప్రవర్తనకు సంబంధించినంతవరకు, నాగరికత పురోగతికి అసహనం గొప్ప ఆటంకం అనే వాస్తవాన్ని అతను విస్మరిస్తూనే ఉన్నాడు. మరియు మనిషి దానిని నేర్చుకోనంత కాలం ఈ అజ్ఞానానికి దూరంగా ఉండండి, అతని ఉనికి ఎల్లప్పుడూ ప్రమాదంలో ఉంటుంది. అత్యంత విధ్వంసక ఆయుధాలు మనిషి ఆధీనంలో ఉండటంతో, ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో కొన్ని సమూహాల మధ్య ఇప్పటికే జరుగుతున్న ఘర్షణలు మరియు స్థానిక యుద్ధాలు మరింత తీవ్రతరం అయితే, మానవజాతి సర్వనాశనం అయ్యే తరుణం ఎంతో దూరంలో ఉండదు. కాబట్టి మనం మన స్వంత వునికి కోసం సహన స్ఫూర్తిని అలవర్చుకోవాలి.

అసహనం అనేది జంతువులు మరియు మృగాల యొక్క ప్రత్యేక లక్షణం. మానవుడు భగవంతుని యొక్క అత్యున్నత సృష్టి కాబట్టి, ఈ స్థానం గురించి కొంచెం ఆలోచించి, తన జంతు ప్రవృత్తిని విడిచిపెట్టి, ప్రతిచోటా సామరస్యం మరియు శాంతి ఉండే విధంగా తన సామర్థ్యాన్ని

మరియు తెలివితేటలను ఉపయోగించాలి. రూపం మరియు ఆకృతిలో మాత్రమే కాకుండా, మీ లక్షణాలు, చర్యలు మరియు అలవాట్ల ద్వారా మనిషిగా వుండండి. మీరు మీలో దైవిక లక్షణాలను పెంపొందించు కోవాలి, ఎందుకంటే మీరు భగవంతుని అమరపుత్రులు మరియు అతని ఆశీర్వాదాలు మీరు గ్రహించడానికి ఎల్లప్పుడూ వుంటాయి.

మనల్ని మనం విద్యావంతులమని చెప్పుకుంటాం. కానీ నిజమైన విద్య మనకు అందించాల్సిన లక్షణాలు అక్కడ లేవు. విద్య ఒక వ్యక్తి యొక్క మానసిక సామర్థ్యాలను అభివృద్ధి చేస్తుంది, ఇది అతనికి అనుకూలతను కలిగి ఉండటానికి మరియు ఇతరులకు సరైన గౌరవాన్ని ఇవ్వడానికి వీలు కల్పిస్తుంది. వాస్తవానికి, అతను తన స్వార్థ మనస్తత్వాన్ని పూర్తిగా తొలగించి, ఇతరుల మంచిని తన హృదయంలో కలిగి వుండాలి. సెయింట్ కన్ఫ్యూషియస్ మాట్లాడుతూ మంచి మానవుడు ఈ క్రింది కొన్ని లక్షణాలను కలిగి ఉండాలి: "తన వైఫల్యానికి ఇతరులను నిందించనివాడు, వారి ప్రయత్నాలలో విఫలమైన వారిని చూసి నవ్వనివాడు, ఆనందంగా ఉండి వ్యర్థానికి దూరంగా ఉండేవాడు, ఎప్పుడూ సత్యాన్ని తెలుసుకోవాలని ప్రయత్నించేవాడు, తన తప్పును చూసేవాడు, ఇతరుల తప్పు కాదు అందరితో స్నేహంగా ఉండేవాడు, కానీ ఎవరితోనూ అనుబంధం లేనివాడు, తన సామర్థ్యాన్ని తన సంపదగా భావించేవాడు, డబ్బు కాదు మరియు ఎల్లప్పుడూ సౌమ్యుడు, హుందాగా మరియు సహనంతో వుండేవాడు.

మీలో ఈ లక్షణాలు ఉన్నాయా లేదా అనేది ఇప్పుడు మీరు సులభంగా చూసుకోవచ్చు మరియు మిమ్మల్ని మీరు నిర్ధారించు కోవచ్చు. మీరు కొన్ని కలిగి ఉండవచ్చు మరియు అన్నీ కాకపోవచ్చు. లేని గుణాలను పొందేందుకు మీరు ప్రయత్నించాలి. కానీ ఒక విషయం ఖచ్చితంగా చెప్పవచ్చు, స్పష్టమైన అవగాహన మరియు జ్ఞానం ఉన్న వ్యక్తి మాత్రమే భగవంతుని కనుగొనడానికి ప్రయత్నిస్తాడు.

శ్రీ స్వామివారు 2013 వ.సం. జనవరి 13న బెంగుళూరులో సిద్ధి పొందారు. జై గురుదేవ్.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**జూన్ 2023**

4 ఆది - జ్యేష్ఠ పూర్ణిమ - శ్రీ సద్గురుపాదపూజ

13 మంగళ - శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ

16 శుక్ర - మాసశివరాత్రి

18 ఆది - అమావాస్య

29 గురు - తొలి ఏకాదశి - ఏకాహం సంకీర్తన, శ్రీ సద్గురుపాదపూజ, భక్త సమారాధన

**జూలై 2023**

1 శని - మాసశివరాత్రి

3 సోమ - ఆషాఢ(గురు)పూర్ణిమ - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ, భక్త సమారాధన

12 బుధ - శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ

15 శని - శనిత్రయోదశి

16 ఆది - మాసశివరాత్రి

17 సోమ - అమావాస్య, దక్షిణాయన పుణ్యకాల ప్రారంభం

20 గురు - అధిక శ్రావణ శుద్ధ తదియ - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ



# మధుర భక్తి

- ఎన్. కుట్టీ

బృందావనంలో, యమునా తీరంలో, వెన్నెల రాత్రిలో ఇసుక తిన్నె మీద కూర్చుని శ్రీకృష్ణభగవానుడు వేణువు వాయిస్తున్నాడు. ఆ వేణునాద మాధుర్యానికి ప్రకృతి పులకించింది. వృక్షాలు చల్లని గాలులు వీస్తున్నాయి. భూదేవి తన్మయత్వం చెందింది. దేవతలు ఆకాశంనుండి పుష్పవర్షం కురిపించారు. ప్రజలంతా మంచి నిద్రలో మునిగి వున్నారు. ఎక్కడినుండో మధుర నాదం వస్తోంది అనుకుని తిరిగి మరల నిద్రలో మునిగిపోయారు.

కానీ, గోపికలు మాత్రం ఆ నాదం చెవుల పడగానే, ఎక్కడి పనులు అక్కడే వదలివేసి, వేణునాదం ఎటువైపునుండి వస్తోందో తెలియక తికమకపడిపోయి, చివరకు ఆ నాదం వచ్చేవైపుకు పరుగులెత్తారు. గోపికలది మధుర భక్తి. అది నవ విధ భక్తిలకంటే మిన్న. వారి భక్తి ఎటువంటిదంటే, ఒక గోపిక పాలు పితుకుతూ పితుకుతూ వుండగా, వేణునాదం వినబడగానే ఆ పాలు పితకడం మధ్యలో వదిలివేసి వెళ్ళిపోయింది. మరొక గోపిక తన బిడ్డకు పాలు పడుతూ పడుతూ వుండగా వేణునాదం వినబడగానే ఆ బిడ్డను అక్కడే వదిలిపెట్టి మధ్యలో వెళ్ళిపోయింది. ఇంకొక గోపిక పాలు కాస్తూ వుండగా, ఆ పాలు పొంగుతున్నా సరే పట్టించుకోకుండా తన కృష్ణుడు వచ్చాడనుకుంటూ అక్కడ నుండి వెళ్ళిపోయింది. మరొక గోపిక స్నానం చేసి, బట్టలు కట్టుకుంటూ సొంతం కట్టుకోకుండానే పరుగెత్తింది. మరొక గోపిక అత్తగారు, భర్త వారిస్తున్నా కూడా వినకుండా వాళ్ళతో పోట్లాడి మరీ కృష్ణ దర్శనానికి వెళ్ళిపోయింది. అదీ గోపికల భక్తి!!

ఈ గోపికలందరూ శ్రీకృష్ణుడు వున్న చోటుకి చేరుకున్నారు. ఆయన పరమానందంతో కనులు మూసుకుని తన్మయత్వంతో వేణువు వూదుతూ వున్నాడు. కొంతసేపటికి ఆయన కనులు తెరిచి చూసేసరికి ఈ గోపికలంతా ఆయన చుట్టూ చేరి కూర్చుని ఆయన గానానికి పరవశులై ఆనందిస్తూ వింటున్నారు. అది చూసి కృష్ణుడు మనసులో చాలా సంతోషించి 'ఆహా! ఏమి భక్తి వీరిది' అనుకున్నాడు. వారితో ఆయన 'గోపికలారా! మీకు ఒకటి చెబుతాను, నా మాట వింటారా?' అని అడిగాడు. అప్పుడు వారందరూ 'కృష్ణా! తప్పక నీ ఆజ్ఞ పాటిస్తాము

చెప్పు' అన్నారు. 'గోపికలారా! ఇంత రాత్రిపూట నా గురించి వచ్చారు కదా. మిమ్మల్ని చూసి ఊరిలో ప్రజలు ఏమనుకుంటారు? జాణలు అనుకోరా? మిమ్మల్ని ఊరి నుండి వెలివేస్తారు కదా? మిమ్మల్ని తిరిగి మీ ఇండ్లలోకి మీ వాళ్ళు రానిస్తారా? మీకు నా మీద అమితమైన భక్తి వున్నదని నాకు తెలుసు. నేను చెప్పినట్లు మీరు చేయండి. ఇప్పుడు మీరందరూ మీ ఇండ్లకు తిరిగి వెళ్ళిపొండి. నేను ఎప్పుడూ మీలోనే వుంటాను. మీ వద్దనే వుంటాను' అన్నాడు శ్రీకృష్ణుడు.

అప్పటికి శ్రీకృష్ణుడి వయస్సు 8 నుండి 10 సంవత్సరాల లోపు. గోపికలు 'కృష్ణా! మేము నిన్ను వదలి వెళ్ళమన్నా వెళ్ళము. మాకు నీ కంటే వేరెవ్వరూ లేరు. నిన్ను నమ్ముకుని మేము ఇళ్ళు, వాకిళ్ళు, అత్త మామలను, భర్తను అందరినీ వదలుకుని వచ్చాము. మమ్మల్ని వెనక్కి తిరిగి వెళ్ళమంటున్నావు కదా, ఇది నీకు న్యాయమా? మేము చావనైనా చస్తాము కానీ, నిన్ను వదలి వెళ్ళము. నీవు తప్ప మాకే యితరము లేరు. తల్లి, తండ్రి, సోదరుడు, భర్త, బంధువులు, స్నేహితులు అన్నీ నీవే' అని రెండు చేతులెత్తి నమస్కరించారు. వారిది అమోఘమైన భక్తి అని పరమాత్మకు తెలుసు. అందుకే ఆయన ఇంక ఏమీ మాట్లాడ లేకపోయాడు. కొంచెంసేపు కృష్ణపరమాత్మ ఆ గోపికలతో కలసి ఆడి, పాడి, వారితో పూజలందుకుని వారిని పరీక్షించదలచి మధ్యలో చటుక్కున మాయమైపోయాడు. ఇంతసేపూ వారితో క్రీడించి హఠాత్తుగా కనబడక పోయేసరికి గోపికలు అటూ ఇటూ వెదకటం మొదలుపెట్టారు. వారిలో దిగులు మొదలైంది. కనబడ్డ ప్రతి వస్తువును, చెట్టును, చేమను, జంతువునూ ఇలా అందరినీ 'మా కృష్ణుడు మహా అల్లరివాడు, మీకేమైనా కనబడ్డాడా?' అని అడగసాగారు. లేదనే సమాధానం విని వారికి దిగులు అధికమైంది.

'హే భగవాన్! నీకు మా మీద దయలేదా? నిన్నే నమ్ముకుని వున్నామే. మాకు ఎందుకిలా అన్యాయం చేశావు? మేము ఏం తప్పు చేశాము? నిన్ను నమ్మడమే మేము చేసిన తప్పా? నీవు కనబడకపోతే మేము ఇక్కడే మా ప్రాణాలు విడుస్తాము' అని ఆ గోపికలంతా ఏడుస్తూ పిచ్చివారిలా అయిపోయి, ఏం చేస్తున్నారో వారికే తెలియక, ఒకతె మరొకరిని పట్టుకుని ఆవిడే కృష్ణుడు అయినట్లు కొంతమంది గోపికలు

తాము కృష్ణుడి తల్లిదండ్రులు అయినట్లుగా లాలిస్తున్నట్లు, ఒక గోపిక పూతన వేషంతో కృష్ణుడికి పాలు ఇస్తుంటే, మరొక గోపిక కృష్ణవేషంతో ఆమెను సంహరిస్తున్నట్లు, ఇలా కృష్ణలీలలు చేయసాగారు.

ఇహ కృష్ణ భగవానుడు వారి మధుర భక్తి చూసి వుండలేక వారికి ప్రత్యక్షమయ్యాడు. గోపికల ఆనందానికి హద్దులేదు. ఒక గోపిక చీర చెంగు తీసి స్వామికి చాపలాగా పరచింది. దాని మీద కృష్ణుడు నడచి వచ్చాడు. మరొక గోపిక ఆయన్ను ఎత్తుకుని ముద్దాడింది. మరొకతె తన చేతితో ఆయనకు పాలు త్రాగించింది. ఈ విధంగా కృష్ణభగవానుడు వారందరినీ ఆనందాబ్ధిలో ఓలలాడించి, చివరకు ముక్తిని ప్రసాదించాడు.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్‌శాఖవారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......**

**జూన్ 2023**

4 ఆది జ్యేష్ఠ పూర్ణిమ - ఉ. 11గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్త సమారాధన.

13 మంగళ - శ్రీ గురుదశమి - సా. 5-30 సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన.

29 గురు - తొలి ఏకాదశి - సా. 5-30గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన.

**జులై 2023**

3 సోమ - ఆషాఢ(గురు) పూర్ణిమ - సా. 5-30గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన.

12 బుధ - శ్రీ గురుదశమి - సా. 5-30 సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన.

(గత సంచిక తరువాయి)

# నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్
తెలుగు అనువాదం - శశికళా దివాకర్

‘ఆమెకు జన్మించిన పుత్రుని యువరాజు చేసెదనని నేను గతంలో ఇచ్చిన మాటను జ్ఞాపకంచేసి అడ్డుపడవచ్చు. ఆ సమయమున నా పరిస్థితి వేరు. పుత్రభాగ్యం లేని సందర్భములో అలా మాటలాడవలసి వచ్చింది. కాని ఇప్పటి పరిస్థితి వేరు. పట్టపురాణియైన కౌసల్య పుత్రుడైన రాముడే పట్టాభిషేకమునకు అర్హుడు. ఆతడే నా పిదప ఈ రాజ్యమునేల వలయును. ఇదియే ఇక్ష్వాకు కులమందలి తరతరాలుగ కొనసాగుచున్న సాంప్రదాయం. కావున భరతుని కేకయ దేశమునకు పంపివేయ వలయును. భరతుడు లేని సమయమున రామునికి పట్టాభిషేక మొనరించినచో కేకయరాజు ఏమియూ చేయజాలడు. కైకేయిని గూర్చి నాకు చింత ఏమియూ లేదు. ఆమే కౌసల్యకంటే అధికముగా రామునిపై తన ప్రాణమే పెట్టుకునియుంది. ...’ యని పలు విధములుగ ఆలోచించి, అయోధ్యనగరరాజు తన ప్రియరాణి కైకేయితో వేటకు వెళ్లవలయునని తీర్మానించుకున్నాడు. ఆమెకు ప్రీతికరమైనది, తనతో వేటకు వచ్చునపుడు, యుద్ధమున తాను పోరాడు సమయమందు తన రథమును నడుపుటయే కదా? కావున ఇప్పుడే అడవికి వేటకు వెళ్లాలి. ఏకాంత సమయమందు ఆమెకు తన మనసులో ఉన్న కోరికను విన్నవించి, ఆమె ఒప్పందమును పొందాలి’ అని తలచి ఆమెతో వేటకై అడవికి బయలుదేరాడు.

వేట బాగానే జరిగింది. పిమ్మట వయసుమళ్లిన దశరథుడు ఒక చెట్టుక్రింద కూర్చునియున్న కైకేయి ఒడిలో తలపెట్టుకుని నిద్రపోయాడు. కైకేయి తన ఒడిలో హాయిగా నిద్రించుచున్న దశరథుని సౌందర్యమును చూస్తూ ఆనందముతో పరవశించిపోయింది.

ఆ సమయమున ఆ చెట్టు తొఱ్ఱలో నివసించుచున్న పక్షులు ఇలా మాట్లాడుకొనసాగాయి. కైకేయికి పక్షుల కూత బాగా తెలియును. ఆమె ఆ పక్షుల సంభాషణను అలా వింటూ సమయమును గడిపింది.

మగపక్షి తన జోడియైన ఆడపక్షితో "ఓ నా ప్రాణసఖీ! మన క్రింద భార్య ఒడిలో తలపెట్టుకుని నిద్రించుచున్నది ఎవరో తెలుసా? ఆతడే అయోధ్య దేశపురాజు దశరథుడు. అమె ఆతని కనిష్ట భార్య కైకేయి. ఆతడు తన ప్రియపుత్రుడైన రామునికి త్వరితగతిన పట్టాభిషేకము చేయదలచాడు. పాపం అతనికి జరుగబోవు విషయం తెలిసే అవకాశంలేదు. ఇంకొద్ది దినముల తరువాతనుండి పధ్నాల్గు సంవత్సరముల వరకు అయోధ్య సింహాసనముపై ఎవరు కూర్చున్నా వారు మరణించుట తథ్యము. ఇటువంటి సమయమున ఆతని పుత్రుడు సింహాసనముపై ఆసీనుడైతే ఎమగునో!?"

ఆడపక్షి, "ఓ నా ప్రాణనాథా! సాధారణ పక్షియైన మీకు ఈ విషయం ఎలాతెలిసింది?" అని ప్రశ్నించింది.

"ఈ మధ్యకాలమున ఈ అరణ్యములో వేటగాడొకడు తన అంబును ఒక వరాహముపై సంధించాడు. అది గురితప్పి కొంత దూరంలో కూర్చునియున్న మునివైపుకు పయనించింది. ఆ సమయమున నేను వేగంగా ఎగిరి వెళ్ళి ఆ అంబును మునిపై పడకుండా నా శరీరమును తాకునట్లు అడ్డుకుని ఆతనిని కాపాడేను. దానికి, ఆతని హృదయము సంతసించి, గాయపడిన నన్ను ఎత్తి పట్టుకుని, నా శరీరముపై ప్రేమతో నిమిరాడు. వెనువెంటనే ఆ గాయం మటుమాయమై పోయింది. అదియేగాక తన తపః మహిమచే నాకు జరుగబోవు సంఘటనలను తెలుసుకునే శక్తిని కూడా ప్రసాదించారు ఆ మునీశ్వరుడు!" అని బదులిచ్చింది మగ పక్షి.

ఇంతవరకూ ఆ పక్షుల సంభాషణను వినిన కైకేయికి వారి మాటలందు ఆసక్తి సన్నగిల్లింది. ఒక్క క్షణం తన హృదయం కొట్టుకోవడం

ఆగిపోయిన భావనకు లోనైంది. 'నాప్రియమైన రామునికి ఆపదా! దానిని నేను తట్టుకోలేను. కావున ఎలాగైనా సరే రాముని పట్టాభిషేకమును నివారించవలయును. అది నేనే చెయ్యాలి' అని తలచి ఒక నిర్ణయమునకు వచ్చింది కైకేయి. 'అయోధ్యరాజా! ఇంకా పధ్నాల్గు సంవత్సరములు గడచిన పిదప రాముడు వచ్చువరకు నిరీక్షించి యుండుము' అని తనలో తాను చెప్పుకొని, ఆమె తన మనసును ధృడపరచుకుంది.

'కానీ రాజు దీనికి ఒప్పుకుంటారా!? పక్షుల మాటలను విశ్వసిస్తారా?'యను భయం ఆమెకు కలిగింది 'దానికేముందిలే? నా ప్రాణసఖి, పరిచారిక మందర దీనికి ఒక మంచి సలహా ఇస్తుందిలే. అంతవరకు ఈ విషయమును ఎవరికీ చెప్పకూడదు' అనుకుని తనను తాను సమాధాన పరచుకుంది కైకేయి.

నిద్రనుండి లేచిన దశరథ మహారాజు, "కైకేయి! నీ వద్ద ఒక విషయమును గురించి చెప్పాలి" అన్నాడు. "మీరు చాలా అలసటతో కూడియున్నారు. సాయంసమయం కావచ్చింది. ఇప్పుడు మనము మన రాజ్యమునకు తిరుగుప్రయాణం చేద్దాం. ఇంకొక దినము వివరంగా మాట్లాడుకుందాము" యని బదులిచ్చి దశరథుని రథముపై నెక్కించుకుని అయోధ్యవైపుకు పయనించింది.

- సశేషం

**పూజ్య శ్రీ మాతాజీ వారి అమెరికా పర్యటన వివరాలు**

24 మే 2023 నుండి 13 జులై వరకు శ్రీ మాతాజీవారు అమెరికాలో పర్యటిస్తారు. ఇందులో భాగంగా శనివారం జులై 1 నుండి మంగళవారం జులై 4 వరకు డల్లాస్‌నందు సత్సంగములు జరుగును. మరిన్ని వివరములకు మాధవరావు పోపూరి గారిని (1-206-715-9990) సంప్రదించగలరు.

# సుబోధ

- యమ్. జానకిరామ శాస్త్రి

భక్తుడు :- భగవంతుని పట్ల ఎంతో భక్తి శ్రద్ధలు కలిగి ఉన్నప్పటికీ కష్టాలను ఎందుకు అనుభవించాల్సి వస్తుంది?

శ్రీ రామకృష్ణులు:- దేహాన్ని ధరించినప్పుడు సుఖదుఃఖాలు అనివార్యాలు. కవి కంకణ్ రచించిన చండీ గ్రంథంలో కాలువీర్‌ను చెరసాలలో బంధించి అతడి ఛాతీ మీద పెద్ద బండరాయిని పెట్టినట్లుగా వ్రాసి వుంది. జగన్మాత వరప్రసాదుడైన కాలువీర్‌కు ఇలా జరిగింది.

శ్రీమంతుడు అనే మహాభక్తుడు ఎన్నో కష్టాలను అనుభవించాడు. అతడి కష్టాలకు అంతేలేదు. దాదాపుగా అతడి తల నరికినంత పనైంది.

జగన్మాత ప్రియతమ భక్తుడొకడు కట్టెలుకొట్టి, అమ్ముకొని, జీవించాల్సి వచ్చింది. అతడికి జగన్మాత సాక్షాత్కారమైనప్పటికీ, అతడు జీవనోపాధికై కట్టెలు కొట్టి అమ్ముకునే కఠోర జీవితాన్నే కొనసాగించాడు.

కారాగారంలో ఉన్న దేవకీదేవికి శంఖచక్రగదాపద్మధారి అయిన శ్రీ మహావిష్ణువు దర్శనం కలిగింది. అయినప్పటికీ ఆమెకు కారాగార విముక్తి కలుగలేదు.

ప్రారబ్ధకర్మ ఫలాన్ని అనుభవించి తీరవలసిందే. పూర్వకర్మలు పూర్తిగా తీరేటంత వరకూ దేహం ఉండే తీరుతుంది. ఒకప్పుడు అంధుడొకడు గంగలో స్నానం చేశాడు. తత్ఫలితంగా అతడి పాపాలు నశించాయి. కానీ అతడి అంధత్వం మాత్రం అలాగే ఉండిపోయింది. పూర్వజన్మలో చేసిన పాపకృత్యాల కారణంగా అతడు అంధత్వం అనుభవించ వలసి వచ్చింది. సాక్షాత్తూ శ్రీకృష్ణుడు పాండవులకు అండగా ఉన్నప్పటికీ వారు అంతులేని కష్టాలను అనుభవించినా, వారు భగవచ్చింతనను వీడలేదు.

భక్తుడు శారీరక సుఖదుఃఖాలను ఎంతగా అనుభవిస్తున్నప్పటికీ అతడు భక్తి జ్ఞానాలనే నిధిని కలిగి ఉంటాడు. ఈ నిధి అతణ్ణి ఎన్నటికీ వీడదు.

## గురు రక్షణకు దూరం అడ్డురాదు

ఆంగ్ల మూలం - శ్రీ రామస్వామి సంపత్
అనువాదం - జగన్నాథ ప్రసాద్

తాబేలు దూరంగా వున్నాగానీ, సంకల్పమాత్రం చేతనే తన పిల్లలకు ఆహారాన్ని అందించగలదు. అలాగే దూరంతో నిమిత్తం లేకుండా శిష్యునికి సద్గురువు రక్షణ ఎప్పుడూ, ఏదో ఒక రూపంలో లభిస్తుంది. కానీ, సచ్ఛిష్యుడు తాబేలు పిల్లలాగా గురువుని తన మనస్సులో నిలపాలి' అని శ్రీబాబూజీ తరచుగా చెప్పేవారు. ఆ విషయాన్ని ఈ క్రింది సంఘటన ఋజువు చేస్తుంది.

అప్పట్లో నేను 'ది హిందూ' ఆంగ్ల దినపత్రిక, విజయవాడ ఆఫీసులో ఎడిటర్‌గా ఉద్యోగం చేస్తున్నాను. 1987సం॥లో జిల్లా పరిషత్ ఎన్నికలు జరుగుతున్నాయి. సమాచారం సేకరించి, నివేదిక తయారు చేయడానికి నేను ఒక ఆదివారం విజవాడలో స్కూటర్‌పై బయలుదేరి, 5వ నెంబరు జాతీయ రహదారిపై గుంటూరు వెడుతున్నాను. మంగళగిరి రైల్వే ఓవర్‌బ్రిడ్జి దిగుతున్న సమయంలో రోడ్డు బాగా ఏటవాలుగా వుండటం చేత, స్కూటరు వేగం బాగా తగ్గించాను. ఇంతలో ఆకస్మికంగా మోపెడ్‌పై బియ్యంబస్తాతో వెడుతున్న వ్యక్తి తన వాహనాన్ని నియంత్రించలేక, నా బండికి అడ్డంగా వచ్చాడు. ప్రమాదాన్ని నివారించడానికి ఎంతో ప్రయత్నించాను. కానీ, రెండు వాహనాలూ గుద్దుకుని ఇద్దరమూ క్రింద పడ్డాము. అతడు కష్టపడి లేచి, వాహనంతో వెళ్ళిపోయాడు. కానీ, నేను నా కుడికాలికి దెబ్బతగలడం చేత లేవలేకపోయాను.

ఎన్నెన్నో వాహనాలు అటూ ఇటూ తిరిగుతున్నాయి. 'సాయం చేయండి!' అని ఆ బాధతోనే అరుస్తున్నాను. కానీ, నాకు సాయం అందించడానికి ఎవరూ రాలేదు. 'ఎవరు రక్షిస్తారా!' అనుకుంటూ అలాగే పడి వున్నాను. ఇంతలో ఒక రిక్షా వస్తోంది. రోడ్డుపై పడివున్న నన్ను చూసి నావైపుకు వచ్చాడు. రిక్షాను నా దగ్గర ఆపి, నన్ను బలంగా లేపి, తన రిక్షాలో కూర్చోబెట్టాడు. క్రింద పడివున్న స్కూటర్‌ను పైకి లేపి, ఇంజను ఆపుచేసి, రోడ్డు అంచుకు తీసుకువెళ్ళి, స్టాండ్‌వేసి, తాళం వేశాడు. దగ్గరలో వున్న హాస్పిటల్‌కు తీసుకువెడుతున్నాడు. దారిలో స్కూటర్ రిపేర్

షాపు కనిపించగా, రిక్షా ఆపాడు. మెకానిక్‌ను పిలిచి, 'దగ్గరలోనే అయ్యగారి స్కూటర్ వుంది. ఇదిగో తాళం. వెళ్ళి వెంటనే రిపేర్ చెయ్యి. మేము తిరిగి ఒక గంటలో వచ్చేస్తాము' అని ఆజ్ఞాపించినట్లుగా చెప్పాడు.

హాస్పిటల్‌కు వెళ్ళాము. అదృష్టవశాత్తు డాక్టరుగారు వున్నారు. కాలినొప్పితో నేను నడవలేకపోతున్నాను. నా బరువంతా తనపై వేసుకుని, నన్ను డాక్టర్‌గారి గదిలోకి తీసుకువెళ్ళాడు. నా కాలును పరిశీలించి, ఎక్సరే తీయించమని కాగితం వ్రాసి ఇచ్చారు. మళ్ళీ నన్ను రిక్షాలో కూర్చోబెట్టుకుని పానకాల నరసింహస్వామి గుడి దగ్గర వున్న పరీక్షా కేంద్రానికి తీసుకువెళ్ళాడు. ఆదివారం అయినా కానీ, అది నా కోసమే అన్నట్లుగా తెరిచే వుంది. ఎక్సరే తీయించుకుని, ఆ ఫిల్మ్, రిపోర్ట్‌తో తిరిగి హాస్పిటల్‌కి వచ్చాము. వాటిని పరిశీలించిన డాక్టర్‌గారు 'వెంట్రుకవాసిగా ఎముక చిట్లింది. ఏమీ ఫరవాలేదు. బ్యాండేజీ వేస్తే చాలు' అని చెప్పి బ్యాండేజీ వేశారు.

డాక్టరుగారు బ్యాండేజీ వేసే సమయంలో నేను 50రూ.లు తీసి రిక్షా అబ్బాయికి ఇవ్వబోయాను. ముఖం కందగడ్డ చేసుకుని 'డబ్బు కోసమా నేను సహాయం చేసింది? దయచేసి, నా సహాయానికి వెల కట్టకండి. ఇక్కడ అయ్యాక మిమ్మల్ని మెకానిక్ దగ్గరకు తీసుకు వెడతాను' అన్నాడు. 'నాతోబాటు సుమారు గంటపై నుండి వున్నావు. నీకు మిగతా బేరాలన్నీ కూడా పోయాయి. తీసుకో' అని ఎంత చెప్పినా ఒప్పుకోలేదు. ఇటువంటి సజ్జనులు ఇంకా ఉన్నారా! ఆశ్చర్యమే!!

- సశేషం



# గురువు వెంట వుంటే

- రేఖ

(గత సంచిక తరువాయి)

ఈ సందర్భంలో మాతాజీ ఒక కథ చెప్పారు. ఒక మహారాజు వుండేవాడు. ఆయన ఎన్నో ఎకరాల తోటకూర పండించి దానం ఇచ్చేవాడు. ఆ రాజుగారి దగ్గరకు ఒక సాధువు వచ్చాడు. మహారాజు అయివుండి కూడా తోటకూర దానమివ్వడమేమిటా? అని ఆయన తన దివ్యదృష్టితో ఈ రాజుయొక్క గతజన్మ వృత్తాంతం తెలుసుకున్నాడు. ఈ రాజు గతజన్మలో సామాన్యుడు. అయినా ఎంతో త్యాగబుద్ధితో వుండేవాడు. ఆయనకు కొంత భూమి వుంటే అందులో తోటకూర పండించి, అందరికీ పంచిపెట్టేవాడు. ఆ సుకృతం కారణంగా ఈయనకు ఈ జన్మలో ఉన్నతమైన మహారాజు జన్మ వచ్చింది. ఇప్పుడు ఈయనకు పూర్వజన్మ స్మృతికూడా వుంది. అందుకే మళ్ళీ పుణ్యం ఆర్జించడం కోసం ఈ జన్మలోకూడా ఎకరాలకు ఎకరాలు తోటకూర పండించి అదేపనిగా పంచిపెడుతున్నాడు.

ఇదంతా చూసి ఆ సాధువు, ఆ మహారాజుతో తన తాహతుకు తగ్గట్టుగా దానం చేయాలని, మనస్సును ఉన్నత స్థితికి పెంచుకోమని హితోపదేశం చేసి రాజుగారి కళ్ళు తెరిపించాడు. ఇక అప్పటి నుండి ఆ రాజు తన తప్పును తెలుసుకుని, తన రాజ్యంలో ప్రజల అవసరాలను కనిపెట్టి అవి తీరుస్తూ, ఎంతో త్యాగబుద్ధి గలవాడై, తన సంపదను సద్వినియోగ పరచుకున్నాడు. తన జన్మను సార్థకం చేసుకున్నాడు. అందుకే మహాత్ములు మనకు బోధిస్తున్నారు - **త్యాగేనైకేన అమృతత్వ మానసుః** త్యాగం వలనే అమృతత్వాన్ని పొందగలం అని. ఇంక దేనివల్ల, ఎవరి వల్ల కాదని శలవిచ్చారు.

శ్రీ శంకర భగవత్పాదాచార్యులవారు వివేక చూడామణిలో .... **దుర్లభం త్రైమేవైతత్ దైవానుగ్రహ హేతుకం మనుష్యత్వం, ముముక్షుత్వం, మహాపురుష సంశ్రయః** అని చెప్పారు.

మానవ జన్మ రావడం, మోక్షాపేక్ష సంకల్పం కలిగి వుండటం, మహాపురుషుల సమాశ్రయం చేయడం ఎక్కువమందికి లభ్యం కాదు. చాలా దుర్లభమైనది. మానవ జన్మ వచ్చినంతమాత్రాన చాలదు. ఒక సత్య గురువును ఆశ్రయిస్తేనే ఈ జీవితం ఎందుకు వచ్చింది, మానవుని

యొక్క ధ్యేయం ఏమై వుండాలో, దానికి జీవనం ఎలా కొనసాగించాలో, మన ప్రవర్తన ఎలా వుండాలో, ఎలా మసలుకోవాలో, సత్య గురుదేవుడి వలననే తెలుస్తుంది. తద్వారా చిత్తశుద్ధి కలిగి, మానవుడు తన ధ్యేయమైన మోక్షస్థితిని పొందగలుగుతాడు. తాను అమృత స్వరూపుడనని తెలుసుకుంటాడు. రాకడ, పోకడ లేని స్థితి అని తెలుసుకుంటాడు. గురువు చెప్పిన, చూపించిన మార్గంలో పురోగమించాలి. గురువు (భగవంతుడు) యందు దృఢభక్తి, అచంచల విశ్వాసం, చిత్తశుద్ధి ఎంతో అవసరం. అప్పుడు ఏ పూజ చేసినా ఫలిస్తుంది. ఎందుకంటే చిత్తశుద్ధి లేని పూజల వలన లాభం లేదు.

ఈ భక్తిని గురించి శ్రీ మాతాజీ చెబుతూ కాళహస్తిలో తిన్నడు అనే కోయజాతిలో జన్మించిన మహాభక్తుని చరిత్ర మననానికి తెచ్చారు. తిన్నడికి భక్తి అంటే ఏమిటోకూడా తెలియదు. కానీ, వినికిడి వల్ల భగవంతుడు అనేవాడు ఒకడు వున్నాడనీ, ఆయన ఎంతో గొప్పవాడనీ, ఆయనకి పూజ చేయాలనీ తెలుసు. అడవులలో క్రూర మృగాలతో జీవనం కొనసాగించేవాడు. పూజ ఎలా చేయాలో అసలు ఎఱుక లేదు. కానీ, రోజూ ఆ అడవిలో వున్న శివాలయానికి ఒక బ్రాహ్మణుడు రావడం, అక్కడ వున్న లింగానికి ఎలా పూజ చేస్తున్నాడో చూశాడు. తిన్నడికి కూడా పూజ చేయాలనే సంకల్పం వచ్చింది. ఒక నిజ భక్తుడిని తరింపజేయాలని, ఆ భక్తుని నిర్మలమైన భక్తిని ప్రపంచానికి తెలియజేయాలనే సమయం వచ్చినప్పుడు, ఆస్వామియే ఆ భక్తునిలో ఒక సంకల్పం, ఒక స్పందన కలుగజేస్తాడు. - సశేషం

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోనండి.

***జూన్ 2023:*** AS 4725, 6509, 6714, 6856, 7385, 7777, 8019, 8029, 8034, 8473, 8738, 8740, 8741, 8744, 8745, 9068

***జూలై 2023:*** AS 3728, 6405, 6692, 6724, 7135, 7184, 7783, 7785, 8149, 9077, 9078, 9081-9085

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీ భోగరాజు నరసింహమూర్తిగారితో శ్రీబాబు

(గత సంచిక తరువాయి) - కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

దానికి ప్రథమ ప్రత్యక్ష తార్కాణంగా, నరసింహమూర్తిగారు తనువు చాలించిన తరువాత మూడవనాడు నరసింహమూర్తి గారి కుమారుడు కోదండ రామయ్య (నందా) తన తండ్రిగారి చితాభస్మాన్ని, అస్తికలను కృష్ణానదిలో నిమజ్జనం చేయటానికి తీసుకొని వెళ్ళినప్పుడు, కృష్ణలో ఆ భస్మమును, అస్తికలను ఉంచి, వెంటనే పైకి చూస్తూ బిర్ర బిగుసుకు పోయాడు. ప్రక్కనే ఉన్న నారాయణ రాజుగారు "ఏమిటి బాబూ?" అని అడిగితే, "నాన్న



గారి ప్రతి అస్తిక ముక్కనుండి శ్రీబాబు రూపము బయటకు వచ్చి ఆకాశ మంత ఎత్తుగా పెరిగి కనిపించిందండి" అన్నాడు. "మీ నాన్నగారు ధన్యజీవులయ్యా!" అన్నారు నారాయణరాజు గారు.

నరసింహమూర్తిగారు దేహం చాలించిన పన్నెండవ రోజున మరొక విచిత్రం జరిగింది. ఆనాడు వారి కుమారుడు కోదండరామయ్య శ్రీగురుపాదపూజకు కూర్చొని, ఎడమ చేతితో స్వామి పాదుకులను పట్టుకొన్నపుడు అతని మనస్సులో "ఇన్ని సంవత్సరాలూ శ్రీ సద్గురుదేవుల మృదువైన చరణ కమలములను స్పృశించి ధన్యత్వం పొందిన యీ చేతులతో యీనాడు యీ చెక్క పాదుకలను పట్టుకోవలసి వచ్చింది కదా" అనే భావం మెదిలింది. ఆ భావన మనస్సులో స్ఫురించిన క్షణంలోనే అతని ఎడమ చేతికి కొన్ని లక్షల ఓల్టుల విద్యుద్ఘాతం తగిలినట్లై, చేతి వ్రేళ్ళు శ్రీ స్వామి పాదాంగుష్టమునకు అతుక్కునిపోయి భరింపరాని మంటతో విలవిలలాడిపోతూ "బాబూ!" అంటూ ఏడ్చేశాడు.

అంత ఏడుపులోనూ అతని మనస్సులో మెరుపు మెరిసినట్లు "ఇవి చెక్క పాదుకలు కావు. స్వామి దివ్య పాదములే. మహాపరాధం! మహాపరాధం!" అని తలపు మారుమ్రోగసాగింది. వెంటనే అతను కుడి చేతితో లెంపలు వేసుకొని "అపరాధం మన్నించండి బాబూ! ఇంకెప్పుడూ

యిటువంటి నీచ భావన చేయను" అని అనుకున్న తరువాత, ఎడమచేతి వ్రేళ్ళు నల్లగా మాడి, ఊడివచ్చాయి. ఆ కాలిన పుండ్లు పది రోజులకుగాని మానలేదు.

1988లో కార్తీక బహుళ దశమినాడు శ్రీ బాబు అవతార పరిసమాప్తి జరిగింది. 1990లో వైశాఖ మాసంలో (16-5-1990) శ్రీ బాబు అన్నపూర్ణమ్మగారికి స్వప్న దర్శనమిచ్చి "నేను మీతో ఎన్నెన్నో పూజలు చేయించుకుంటానని వరమిచ్చాను. ఇప్పుడు మీకు ఆ అవకాశం యిస్తున్నాను. ఇప్పటినుండి మీరు ప్రతినెలా బహుళ దశమినాడు శ్రీసద్గురు పాదపూజ చేసుకోండి. మీకు ధనాభావమనేదే ఉండదు. ఈ నియమం తప్పక మీరు, మీ పిల్లలూ తరతరాలుగా అలా పూజ జరుపుకోండి" అని ఆదేశించారు.

ఆ సద్గురు వాక్యానికి ఋజువుగా, అన్నపూర్ణమ్మగారికి విజయవాడలో ఉన్న వారి అన్నగారి దగ్గర నుండి ఉత్తరం వచ్చింది. "నిన్ను మన యింటి నుండి పంపించి వేసేటప్పుడు నీ ఆస్తి వాటా నీకు అప్పచెబితే, ఖర్చు పెట్టేస్తారనే భయంతో నీ భవిష్యజ్జీవితానికి ఏర్పాటుగా 65,000 రూపాయలు బ్యాంకులో వేయటం జరిగింది. ఇప్పటి నీ పరిస్థితులలో నీకు ధనం అవసరం అవుతుంది గనుక, యిక నుండి దాని మీద వచ్చే వడ్డీ ప్రతి నెలా నీకు అందే ఏర్పాటు చేశాను. ఈ నెల వడ్డీ డబ్బు చెక్కు రూపంలో పంపుతున్నాను"అని అన్నగారి ఉత్తరం రూపంలో ఆ భగవద్వాక్యానికి ఋజువు దొరికింది. బ్రహ్మ దేవుడు కూడా దాన్ని పొల్లు చేయలేడు.

అప్పటి నుండి అన్నపూర్ణమ్మగారు, పిల్లలు ప్రతి నెల శ్రీగురుదశమి నాడు శ్రీసద్గురుపాదపూజ చేసుకుంటున్నారు.

## విష్ణు  కధలు

(గత సంచిక తరువాయి)

-రమణ ప్రసాద్

# సమర్థ రామదాసు

శివాజీ సమర్థులతో "స్వామీ! మీకు తాంబూలం ఇచ్చే శిష్యుడిని మార్చాలి" అన్నాడు. "ఏం శివాజీ? అతడు చేయరాని పనులేమైనా చేస్తున్నాడా? చెప్పు. ఇప్పడే శిక్షిద్దాం" అన్నారు సమర్థులు. "కారణం ఏదైతేనేం అతనిని మార్చండి" అన్నాడు శివాజీ. సమర్థులు వెంటనే "భోళారామ్! నాకు తాంబూలం కావాలి పట్టుకురా" అన్నారు. "అన్నట్లు ఆ వక్క దంచే రోలుకూడా పట్రా" అన్నారు. భోళారాం నోరు కడుక్కొని తాంబూలం నమిలి తన తలను నరికి "శివాజీ మహరాజ్ ! గురు మహారాజ్ సమర్థులు రోలును తెమ్మన్నారు కదా. ఈ రోలును తీసుకు వెళ్ళండి." అన్నాడు. శివాజీ చేతులు వణికాయి. సమర్థుల వద్ద శిరస్సు ఉంచగానే, నోట్లోంచి తాంబూలం సమర్థుల చేతిలో పడింది. అది అందుకుని "శివాజీ! ఈ రోటిని యధాస్థానంలో ఉంచండి" అన్నారు. శివాజీ ఆ తలను భోళారాం మొండెంపై పెట్టగానే అది పూర్వంలా అతుక్కుంది. "శివాజీ రాయా! చెప్పుడు మాటలు ఎంత ప్రమాదానికి దారి తీస్తుందో చూశావా? ఇంత ప్రీతితో, భక్తితో ఇచ్చే తాంబూలం మేము సేవించాలా వద్దా? మీరే చెప్పండి" అన్నారు. శివాజీ "స్వామీ నేను అపరాధిని, పాపిని. నన్ను క్షమించండి" అన్నాడు.

ఒక రోజు సమర్థులు సంకీర్తన చేసి గంగానది మహత్త్యం, కాశీక్షేత్రం గొప్పతనం గురించి శిష్యులకు చెప్పారు. శిష్యులు "మమ్మల్ని కాశీక్షేత్రం తీసుకువెళ్ళండి" అన్నారు. "మరి ఇక్కడ రోజూ శ్రీరాముడికి పూజా నైవేద్యాలు ఎవరు చేస్తారు?" అన్నారు సమర్థులు. "మీలో మీరే ఆలోచించుకుని ఎవరో ఒకరు ఉండిపోండి" అన్నారు. ఆ సమయంలో కళ్యాణ్‌గాని ఉద్ధవుడుగాని లేరు. "అజ్ఞాన్" అనే కొత్తగా వచ్చిన శిష్యుడు ఉన్నాడు. అతని పేరు సూచించారు. అతనితో "నిన్ను గురువుగారు ఇక్కడే ఉండి పూజ, అర్చన, నైవేద్యాలు చూసుకోమని ఆజ్ఞాపించారు." అని చెప్పారు. సమర్థులతో "అజ్ఞాన్ ఉండటానికి ఒప్పకున్నాడు" అన్నారు.

"రాజీపడ్డాడా? మీరు రాజీ పరిచారా?" అన్నారు సమర్థులు. "అతడే ఉ ంటాను అని అన్నాడు" అన్నారు అందరూ. ఆ మర్నాడే అందరూ కాశీకి బయల్దేరారు. సమర్థులు "అజ్ఞాన్! నీకు కాశీ రావాలని లేదట్రా? అన్నారు. అజ్ఞాన్ చటుక్కున గురుదేవుల పాదాలు పట్టుకుని "ఇంతకన్నా కాశీ, బదరీ, గంగా స్నానాలు కావాలా స్వామీ?" అన్నాడు. ఆయన వాణ్ణి ఆశీర్వదించి రాముడికి చేయవలసిన పూజా విధానం, నైవేద్యం సమర్పించే పద్ధతి, హారతి ఎలా ఇవ్వాలో చెప్పి "మేము వచ్చేసరికి ఐదారు నెలలు పట్టవచ్చు" అన్నారు.

సమర్థులు వెళ్ళిన మర్నాడు భిక్షాటనంచేసి వంటచేసి నైవేద్యం పెట్టి ఆరగింపుల కోసం తలుపులు మూశాడు. "అదేమిటి? ఎవ్వరూ భోజనం చెయ్యరేం" అనుకున్నాడు. మూడురోజులు గడిచాయి. వాళ్ళు తినేదాకా తాను తినకూడదని అతని నియమం. నాల్గవ రోజున రాములవారి విగ్రహం ముందు నుంచుని "ఏమయ్యా! మీరందరూ భోజనం చేయకపోతే సమర్థులకు నా ముఖం ఎలా చూపను? రండి భోంచెయ్యండి" అన్నాడు. ఎంత బ్రతిమాలినా వారు వచ్చి భోంచేయకపోతే రాముడి పాదాలకు తలబాదుకోసాగాడు. రాముడి పాదాలు రక్తసిక్తమయ్యాయి.

- సశేషం



Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

ఏప్రియల్ 12 నుండి 16 వరకు శ్రీ బాబు భక్త సమాజ్,
శ్రీ కాళీవనాశ్రమము బెంగళూరుశాఖ వారు
నిర్వహించిన సత్సంగ కార్యక్రమముల దృశ్యములు.











REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on 5th and 6th of every month.

RNI No.: 37804/1981
Postal Regd. No. : GTR/27/2021-2023

## ఏప్రియల్ 23 నాడు శ్రీ కాళీవనాశ్రమంలో ముముక్షు భజన మండలి, హనుమాన్‌జంక్షన్ వారిచే శ్రీ వెంకటేశ్వర కళ్యాణ గానామృతం







If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.